ప్రజాశక్తి

శుక్రవారం 11 ఆగస్టు 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా

వీరులపాడు మండలం దాచవరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి గురువారం నామినేషన్లు వేస్తున్న వైసిపి అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు, టిడిపి అభ్యర్థి తోట రవికుమార్

పంచాయతీ ఉప ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

- ఎన్‌టిఆర్ జిల్లాలో మూడు పంచాయతీలు, 12 వార్డులకు ఎన్నికలు
- మొత్తం 35 నామినేషన్లు దాఖలు
- 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల అకాల మరణాలు, రాజీనామాల కారణంగా ఎన్టీఆర్ జిల్లాలో 3 గ్రామ పంచాయతీలు, 12 వార్డులకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహాని ఈనెల 6న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 19న ఎన్నికలు జరగనున్నాయి. 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు విధించారు. 11న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. 14వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీదారుల తుది జాబితాను ప్రకటిస్తారు. 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుంది. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. ఏదైనా కారణాల వల్ల రీపోలింగ్‌కు పరిస్థితులు దారి తీస్తే 20వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రీపోలింగ్ నిర్వహించనున్నారు.

3 సర్పంచ్, 12 వార్డు పదవులకు ఎన్నికలు

ఎన్టీఆర్ జిల్లా వీరుల్లపాడు మండలం దాచవరం, వత్సవాయి మండలం పెదమోదుగపల్లి, జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామ సర్పంచ్‌ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నందిగామ మండలం తొర్రగుడిపాడు పంచాయతీలోని 8వ వార్డు, వీరుల్లపాడు మండలం దొడ్డదేవరపాడు (మిగతా 6లో)

బందరులో మెడికల్ కళాశాల

ప్రారంభోత్సవ సందడి

- 16 నుంచి అందుబాట్లోకి నూతన భవనం
- అడ్మిషన్లు ప్రారంభం
- ఆలిండియా కోటాలో రెండు సీట్లు భర్తీ
- మరో వారంలో రాష్ట్ర స్థాయిలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్
- సెప్టెంబర్ 1 నుంచి బోధన

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా మచిలీపట్నం (బందరు) లో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ సందడి మొదలైంది. కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆలిండియా కోటాలో బందరు మెడికల్ కాలేజీలో రెండు సీట్లు భర్తీ అయ్యాయి. మరో వారంలో రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మరో 148 సీట్లను భర్తీ చేయనున్నారు. ఆగస్టు చివరినాటికి ప్రవేశాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సిలబస్ బోధన ప్రారంభమవుతుంది. దీంతో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాల్లోని ఏడు ఏడు బ్లాకుల్లో కార్యకలాపాలను ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభించడానికి అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది.

బందరు మెడికల్ కళాశాలలో మొదటి దశలో ఏడు బ్లాకులను నిర్మించారు. రూ.550 కోట్ల విలువైన పనులకుగాను రూ.125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ప్రయోగశాలలలు, లెక్చరర్ గ్యాలరీ, ఎగ్జామినేషన్ హాలు, అడ్మినిస్ట్రేషన్ హాలు, బాల బాలికలకు విడివిడిగా వసతి గృహాలను లక్షా 43 వేల చదరపు అడుగుల్లో నిర్మించారు. ఈ భవనంలో ప్రొఫెసర్లకు, విద్యార్థులకు అవసరమైన టేబుళ్లు, కుర్చీలు తదితర ఫర్నీచర్ సిద్ధంగా ఉంది. క్లాస్‌రూమ్‌లో రెండు, ప్రయోగశాలల్లో రెండు ఎల్ఇడి ఇంటరాక్టివ్ ప్యానళ్లతోపాటు ఒక్కో రూమ్‌లో 75 ఎంఎం బిగ్ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు.

నిర్మాణం పూర్తి చేసుకున్న కళాశాల భవనం, సిద్ధమవుతున్న ఫర్నీచర్

మొదటి దశ నిర్మాణాలకు బారికేడ్లు

మొదటి దశలో నిర్మాణం పూర్తయిన ఏడు బ్లాకులకు అనుసంధానంగా సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి దశలో పూర్తయిన ఏడు బ్లాకులకు సంబంధించి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా రెండో దశ నిర్మాణాలకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

మొదటి దశలో ఏడు బ్లాకుల నిర్మాణం

రవీంద్రబాబు, ఎపిఎంఐడిసి ఇఇ, మచిలీపట్నం

మచిపట్నం మెడికల్ కళాశాల మొదటి దశలో రూ.125 కోట్లతో ఏడు బ్లాకుల నిర్మాణం జరిగింది. ఈ బ్లాకులను అనుసంధానిస్తూ సిసి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ నెల 16వ తేదీకి అన్ని పనులు పూర్తి చేసి కళాశాల పాలనా విభాగానికి భవనాన్ని అప్పగిస్తాం. కుర్చీలు, టేబుళ్లు, ఎల్ఇడిలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని త్వరగా అమరుస్తాం.

'అసైన్డ్' చట్ట సవరణ ఆర్డినెన్సు రద్దు చేయాలి

- అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి దళితులు, నిరుపేదలకు పంచాలి
- రౌండ్‌టేబుల్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం దళితులకు భూమి హక్కు కల్పించే పేరుతో ఉన్న భూములను కూడా భూస్వాములు లాక్కునేలా తీసుకువస్తున్న అసైన్డ్ భూముల 9/77 'అసైన్డ్' చట్ట సవరణ ఆర్డినెన్సును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మచిలీపట్నంలోని జ్యోతిబాఫూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘాలు, వివిధ సామాజిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 9/77 'అసైన్డ్' చట్ట సవరణ ఆర్డినెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులను భూముల నుండి వెళ్లగొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా అసైన్డ్ చట్టసవరణకు పూనుకుంటోందని విమర్శించారు. దళితులకు ఇచ్చిన భూముల్లో 50శాతం ఇప్పటికే అన్యాక్రాంతమైందన్నారు. మిగిలివున్న భూములను కూడా ఈ చట్టసవరణతో భూస్వాములు లాక్కుంటారని పేర్కొన్నారు. అసైన్డ్ భూములు అమ్మకాలు, కొనుగోళ్లను నిషేధిస్తూ 1977లో తీసుకువచ్చిన చట్టాన్ని పాలకులు సరిగా అమలు చేయలేదన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇక శాశ్వతంగా అసైన్డ్ భూములను లాక్కునేలా చట్టసవరణకు ప్రయత్నిస్తోందన్నారు. 9/77 చట్టం వున్నా ఇళ్లస్థలాల కోసం పేదల భూములను దౌర్జన్యంగా లాక్కుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో 1954 - 2002 మధ్యకాలంలో అసైన్డ్ భూములు పొందిన పేదలకు హక్కులు కల్పిస్తామనే మంత్రివర్గ నిర్ణయం కుట్ర పూరితమైందన్నారు. లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని నివేదిక ఇస్తే ఏ ప్రభుత్వమూ ఈ భూములకు విముక్తి కల్పించేందుకు పూనుకోలేదని విమర్శించారు. భూసమస్యలపై కోనేరు రంగారావు కమిటీ (మిగతా 6లో)

చట్ట సవరణ నిలిపేయాలని తీర్మానం

9/77 చట్ట సవరణ నిలిపి వేయాలని, ఈ చట్టం ప్రకారం జిల్లాలో వెంటనే ఎంజాయిమెంట్ సర్వే జరపాలని, అసైన్డ్ భూముల జాబితాలను సచివాలయాల వద్ద నోటీసు బోర్డ్‌లో పెట్టాలని, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను వాస్తవ లబ్ధిదారులకుగానీ, వారి వారసులకుగానీ తిరిగి ఇవ్వాలని, భూ వ్యవహారాల్లో పోలీసుల జోక్యాన్ని నివారించాలని, మండల స్థాయిలో అసైన్‌మెంట్ కమిటీలు వేయాలని, అక్రమంగా అనుభవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ

అందుబాట్లోకి పుస్తక పంపిణీ కేంద్రాలు

- గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ
- 2023-24 బడ్జెట్ అంచనాలకు ఆమోదం

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా గ్రంధాలయలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి మౌలిక వసతులను కల్పించడం ద్వారా పాఠకుల మన్ననలను పొందేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌సర్సన్ టి.జమలపూర్ణమ్మ తెలిపారు. జిల్లా గ్రంధాలయ సంస్థ సర్వ సభ్య సమావేశం గురువారం విజయవాడ బందర్‌రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జమలపూర్ణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఆమోదించడంతోపాటు పుస్తక పంపిణీ కేంద్రాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో 109 శాఖా గ్రంధాలయాలకు అదనంగా 161 పుస్తక పంపిణీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గత బడ్జెట్లో సిబ్బంది జీత భత్యాలు, పెన్షన్లు, వాహన ఛార్జీ ప్రయాణ భత్యం, ఇతర పనులకు చెల్లించిన 7 కోట్ల 73 లక్షల 82 వేల 798 రూపాయల ఖర్చులు ఆమోదించినట్లు (మిగతా 6లో)

వంద పడకల ఆస్పత్రికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని డీ.వీ.ఆర్.కాలనీ సమీపంలో ఏర్పాటు చేయనున్న వంద పడకల ఆసుపత్రి స్థలాన్ని నాబార్డ్ ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులతో కలిసి శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నందిగామ ప్రజల చిరకాల వాంఛయైన 100 ఆసుపత్రి మంజూర్యయిందని, నిర్మాణానికి రూ.35 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందన్నారు. నేడు నాబార్డు ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు స్థలాన్ని పరిశీలించి సంతప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 100 పడకల ఆసుపత్రి నందిగామకు మణిహారంగా మారబోతుందని, నందిగామ పరిసర ప్రాంత ప్రజలు వైద్య సేవలకు విజయవాడ వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే అన్ని విభాగాల్లో మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. నందిగామ అభివద్ధిలో కీలక ఘట్టంగా ఆసుపత్రి నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని, రానున్న భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని ఆసుపత్రి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం మిలింద చోలస్కర్, జిల్లా ఆరోగ్యశాఖ ఈఈ లింగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న నాబార్డ్ ప్రతినిధులు, ఎంఎల్‌సి

నులి పురుగుల నివారణా మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నులిపురుగుల మాత్రతో పోషకాలను కాపాడుకుని ఆరోగ్యవంతులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు విద్యార్థులకు సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటమటలంకలోని కొమ్మాసీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో

గురువారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగుల కారణంగా కిశోర బాలికలలో పోషకాహారం లోపించి రక్తహీనత, ఆకలి మందగించడం నీరసం ఆందోళన కడుపు నొప్పి వాంతులు విరోచనాలు బరువు తగ్గడం వంటి రుగ్మతలకు గురి కావాల్సి వస్తుందన్నారు. నగర మేయర రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నులి పురుగుల నివారణ మందును తీసుకోవడం వలన రక్తహీనతను నివారించుకుని చదువుపై ఏకగ్రత విద్యా సామర్థ్యం పెంచుకోవడం వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యై ఆరోగ్య శాఖ అధికారిణి డా. యం సుహాసిని, ఐసిడిఎస్ పిడి జి. ఉమాదేవి, డిఈఓ సివి రేణుక, రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డా. జి.మాధవి, మెడికల్ ఆఫీసర్ డా. ఉస్మాన్ పాల్గొన్నారు.

వేతన ఒప్పందాన్ని పున:సమీక్షించాలి

ప్రజాశక్తి-విజయవాడ: విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు,అధికారులు,జెఏసి ప్రతినిధులుతో చేసిన వేతన ఒప్పందం ఉద్యోగులుకు తీవ్ర నష్టదాయకమైన,అసంబద్దమైనదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ వేతన ఒప్పందాన్ని పునఃసమీక్షించాలని విద్యుత్ఉద్యోగుల పోరాట కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు నాయకులు ఎల్‌రాజు, జి కనకలింగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ...విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై జెఏసి ప్రతినిధులతో మంత్రులు జరిపిన చర్చల్లో ఉద్యోగులు నష్టపోయే రీతిలో ఒప్పందం జరిగిందని అన్నారు. వీటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

జనసేన నిరసన

ప్రజాశక్తి-తిరువూరు: చిరంజీవిని కించపరుస్తూ మాట్లాడారని ఆరోపిస్తూ జనసేన నాయకులు, అభిమా నులు తిరువూరు బోసు బొమ్మ సెంటర్‌లో డౌన్ డౌన్ మాజీ మంత్రి కొడాలి నాని, గుట్కా మంత్రి అంటూ నినాదాలు చేస్తూ అయన చిత్రాన్ని కాళ్లతో తన్ని చించివేశారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు జయప్రకాష్ ఎల్. సుధాకర్ పసుపులేటి రవీంద్ర, పసుపులేటి పండు పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 5వ వార్డ్ లో విద్యుత్ సమస్యలపై కౌన్సిలర్ వట్టే మనోహర్ అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వైవై కాలనీలో లోవోల్టేజ్ కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. సమస్యపై స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులు వార్డులో పర్యటించారు. సంబంధిత సమస్యలు పరిశీలించిన మేరకు వార్డులో నూతనంగా 100 కేవి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని మనోహర్ కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరితగతిన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

నాగప్రజ్వశ్రీకి ఎంబిబిఎస్ సీటు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి వరకు చదువుకున్న కనోజి నాగ ప్రజ్వశ్రీ నీట్ పరీక్షలో 550 మార్కులు సాధించి యంబిబియస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని స్కూలు హెచ్ఎం శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన జుజ్జవరపు పౌల్, కుటుంబ సభ్యులు షేర్ మహమ్మద్ పేట గ్రామంలో టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, కసుకుర్తి శ్రీనివాసరావు, షేక్ బడే మియా, యానాల గోపి, నెట్టెం నాగరాజు పాల్గొన్నారు. పట్టణంలోని 13వ వార్డు కొత్త బంగారుపేటకు చెందిన తమ్మిశెట్టి స్వామి టిడిపిలో చేరారు. వీరికి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ ధనుంజయ (చినబాబు) కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి రాఘవ, మైనేని రాధా కృష్ణ, చింతల పుల్లయ్య, ఓర్సు కష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య నిర్వీర్యానికి కుట్ర : ఎస్ఎఫ్ఐ

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు

ప్రజాశక్తి-నందిగామ: ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నందిగామ యుటిఎఫ్ భవనంలో ఎస్ఎఫ్ఐ మండల ప్లీనం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కే.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి జగనన్న అమ్మఒడి, వసతిదీవెన, విద్యదీవెన ఇవ్వాలన్నారు. జి.ఓ నెంబర్ 77 వెంటనే రద్దు చేసి పిజి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని అని కోరారు.బిజెపి ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే పద్ధతులు కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే విద్యారంగానికి నష్టం చేసే వాటిని తొలగించాలని కోరారు. అనంతరం నందిగామ మండల అధ్యక్షుడుగా పి.రవి, మండల కార్యదర్శిగా జి.గోపినాయక్ లను ఎన్నుకున్నారు. ఆరుగురిని మండల కార్యదర్శి వర్గంలో తీసుకున్నారు. కాజు, ఆదిత్యలను మండల ఉపాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శిలుగా రఫీ, వెంకటేశ్వర్లులతో పాటు పది మందిని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

భవిష్య కళాశాలలో మోటివేషన్ క్లాసులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని భవిష్య కాలేజీలో మోటివేషన్ క్లాసులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ సతి మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను పిల్లలందరికీ అందించాలని, అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలందరూ చదుకునేందుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పేదరికం వల్ల ఎవరూ విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఎంతో మందికి వారికి అవసరమైన సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భవిష్య కాలేజీ ప్రిన్సిపల్ యం.శ్రీనివాస్, డాక్టర్ హర్ష, డాక్టర్ అమూల్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సెంటర్ అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ గాంధీ సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటు, హైకోర్టు తీర్పు అంశాలపై నందిగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్ గాంధీ సెంటర్‌ను అభివృద్ధి చేయాలన్నదే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్నందునే విగ్రహాలను పక్కన ఏర్పాటు చేయాలనుకున్నామని తెలిపారు. నందిగామను అభివృద్ధి చేయాలనే తలంపుతోనే రోడ్ల విస్తరణ పనులు చేపట్టామన్నారు. విగ్రహాల ఏర్పాటుపై పిటిషనర్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చినప్పటికీ17 నెలల తరువాత హైకోర్టు స్టే పిటిషన్‌ను కొట్టివేస్తూ మూడు అంశాలతో కూడిన తీర్పును వెలువరించిందన్నారు. కోర్టు నిబంధనలకు అనుగుణంగా విగ్రహాల ఏర్పాటుపై ముందుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నరహరిశెట్టి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఏఐసిసి సభ్యులు, విజయవాడ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు

జన్మదిన వేడుకలు గురువారం పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి కార్యాలయం, సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు, అలాగే పెనమలూరు నియోజకవర్గం చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షులు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో మరియు సెవెన్ సీటర్ ఆటో యూనియన్ సమక్షంలో మరియు ది నేషనల్ ఫ్రూట్స్ హకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తదితర ప్రాంతాలలో నరహరిశెట్టి నరసింహారావు జన్మదిన వేడుకలను నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-నందిగామ: చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో గురువారం మృతిచెందింది. నందిగామ పట్టణంలో మెకానిక్‌గా పని చేస్తున్న యంద్రాతి ఆనంద్‌కు ఏటూరు గ్రామానికి చెందిన మనీషా(28)తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. గురువారం అనుమానాస్పద స్థితిలో మతి చెందడంతో యువతి కుటుంబ సభ్యులు భర్త ఆనంద్ కుటుంబ సభ్యులతో వాగ్వివాదానికి దిగారు. వరకట్న వేధింపుల వల్లే తమ కుమార్తెను చంపారని ఆరోపణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాచవరం ఉపఎన్నికకు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలోని దాచవరం గ్రామపంచాయతీ ఉప ఎన్నికకు గురువారం పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి సర్పంచ్ అభ్యర్థిగా గద్దె వెంకటేశ్వర్లు, టిడిపి బలపరిచిన తోట రవికుమార్, జనసేన పార్టీ అభ్యర్థిగా కామిశెట్టి వెంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 19వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది.

పది దుకాణాలకు సీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ప్రధానరహదారిలోని శ్రీ బ్రహ్మానంద మఠంకు చెందిన పది షాపులను గురువారం దేవాదాయ శాఖ అధికారులు సీలు వేశారు. రాజీవ్ చౌక్ సమీపంలో ఉన్న పది షాపుల వద్దకు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ చెందిన అసిస్టెంట్ కమిషనర్ కే శాంతి ఆదేశాల మేరకు అధికారులు సిబ్బంది షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. నిబంధన ప్రకారం నడుచుకోకపోవడంతో షాపులు సీజ్ చేయటం జరిగిందని అధికారులు తెలిపారు. పట్టణంలో పలు దేవాలయాలపై వచ్చిన కంప్లైంట్ మేరకు వాటిని కూడా పరిశీలిస్తామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె శాంతి తెలిపారు.

ఏడో వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 7వ వార్డు ఆర్టీసీ కాలనీలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ముఖ్యంగా ఇళ్లకు పట్టాలు ఇప్పించాలని, వీధులలో స్తంభాలు వేయించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, ఇంకా ఇతర సమస్యలు ప్రజలు శ్రీరామ్ తాతయ్య దష్టికి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, బోస్ యాదవ్, గడ్డం రాంబాబు యాదవ్, మొగిలి శ్రీను, కోత్తా నాగరాజు, శ్రీను, మౌలాలి, బద్రి, గోపి, బాల సైద, నారాయణ, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-వత్సవాయి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న మణిపూర్ మారణహోమాన్ని ఆపాలని, నిందితునుల కఠినంగా శిక్షించాలని సిపిఎం గ్రామ కార్యదర్శి రాయల సుదర్శనం డిమాండ్ చేశారు. గురువారం వత్సవాయి మండలంలోని మంగోళ్ల గ్రామంలో గ్రామపంచాయతీ సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అరాచకపు గుండాల నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మణిపూర్‌లో ఘటన జరిగి రోజులు గడుస్తున్న మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. దేశంలో మతకలహాలు సష్టించాలని బిజెపి చూస్తుందని దీనికి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరిసే రత్నబాబు, దేవినేని లక్ష్మీనారాయణ, కనకపుడి పటేల్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** గత మూడు మాసాల నుండి మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండలను ఖండించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా సంఘాలు గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతమ్మ, లక్ష్మి, తిరుపతమ్మ, మంగమ్మ పలువురు మహిళలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శుక్రవారం 11 ఆగస్టు 2023

నులిపురుగుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

మాత్రలు వేస్తున్న కలెక్టర్ పి. రాజాబాబు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పిల్లల ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించు కొని చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు వివిధ ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని, వాటిలో ప్రధానంగా రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడుతుందని, ఫలితంగా నీరసంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందని అన్నారు. ఈ విధమైన సమస్యలను అధిగమించడానికి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వారిచేత మింగించాలని అధికారులకు సూచించారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పర్యవేక్షించాలన్నారు. ఒకటి నుంచి ఐదు ఏళ్ల పిల్లలకు అంగన్వాడి కేంద్రాలు, ఆరు నుంచి 19 ఏళ్ల కిశోర బాలలకు పాఠశాలలు, కళాశాలలో మాత్రలు తప్పనిసరిగా పంపిణీ చేయాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జీ. గీతాబాయి, జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తానా, ఉప విద్యాశాఖ అధికారి సుబ్బారావు, 9వ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, ప్రధానోపాధ్యాయులు కష్ణమూర్తి, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నవభారత్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ షేక్ ఇమామ్ మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థుల కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం మరియు రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదలలో లోపాలను కలిగి ఉంటారని తెలియజేశారు. ఆశ వర్కర్లు వై నాగలక్ష్మి, జె వీరమ్మ , సుభాషిని శివమ్మ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ జాకీర సుల్తానా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలలలో బాలబాలికలకు ఆల్బెండొజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్సీ పరిధిలోని 16 పాఠశాలలకు 23 అంగన్వాడీ కేంద్రాలకు మాత్రలు పంపిణీ చేశామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.దీప తెలిపారు ప్రాథమిక ఆరోగ్య విస్తరణాధికారి పి నాగార్జున, బాబురావు, సిహెచ్ఓ దయామని, శ్రావని, ఏఎన్ఎం కె అఖిల ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి, గుడ్లవల్లేరు** : జాతీయ నులుపురుగు నిర్ములన కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం 118మంది విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎఎన్యంలు రమాదేవి, ఆశావర్కర్లు చందన, జ్యోతి, విజయ, సుధారాణి మరియు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల మండలంలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, విద్యార్థులకు నులిపురుల నివారణ మాత్రలు వేసినట్లు వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. లంకపల్లి, మేడూరు, కృష్ణాపురం, అమీనాపురం, అలాగే కపిలేశ్వరపురం పిహెచ్సి పరిధిలో కపిలేశ్వరపురం, తాడంకి, మర్రివాడ, గోపువాని పాలెంలలో మాత్రలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల** : విద్యార్థులు నులిపురుగుల నివారణ మందులు తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీవో కె.వెంకట సుబ్బారావు తెలిపారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఘంటసాలలోని మహాత్మాగాంధీ జడ్పీ హైస్కూల్లో చదువుతున్న 339 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. అనంతరం నులిపురుగుల నివారణ గురించి విద్యార్థులకు డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల పి.హెచ్.సి వైద్యులు వెంకటేశ్వరరావు, హెచ్ఎం శ్రీరంగవల్లి, హెల్త్ సూపర్వైజర్ శివకష్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీని నగరపంచాయతీ కమిషనర్ పి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అర్బ న్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఎన్. తేజస్విని, స్కూల్ హెచ్ఎం పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గీత కార్మికునికి పరిహారం అందించాలని వినతి



ప్రజాశక్తి - మొవ్వ : కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి పడిపోయి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న గీతకార్మికునికి నిభందనల మేరకు వెంటనే పరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం కష్ణా జిల్లా కమిటీ అధ్యక్షులు వాకా రామచంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి గ్రామానికి చెందిన గీతకార్మికుడు బోలెం సుబ్బారావు గత నెల 9వ తేదీన జీవనోపాధి కోసం తాడిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడిపోవటంతో తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ మంచానికే పరిమితమయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న సుబ్బారావు భవిష్యత్తులో గీతవత్తి చేసే అవకాశం లేదని వైద్యులు స్పష్టం చేసినట్లు చెప్పారు.ప్రమాద ఘటనపై విచారించి నిభందనల మేరకు బాధిత గీత కార్మికునికి ప్రభుత్వం నుండి రావాల్సిన పరిహారం ఇప్పించాలని కోరుతూ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇరవై రోజుల క్రితమే దరఖాస్తు సమర్పించుకున్నా ఇంతవరకు కనీసం విచారణ కూడా జరపకపోవటం విచారకరమన్నారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపించి నిభందనల మేరకు బాధిత గీత కార్మికునికి ప్రభుత్వం నుండి రావాల్సిన పరిహారం వెంటనే ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని మొవ్వ తహశీల్దారు కార్యాలయంలో ఆర్ఐ ఇ.విజయలక్ష్మి కి అందించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి కల్లుగీత సొసైటీ అధ్యక్షులు తాతా పోతురాజు, శివప్రకాష్ ,శ్రీను ,నాగరాజు, శ్రీనివాసరావు, అర్జునరావు, కౌలు రైతు సంఘం నాయకులు శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో ఇటీవల గుండెపోటు కారణంగా అకాల మరణం చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నిక్కు సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, మండలి పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, రాష్ట్ర తెలుగు యువత నాయకులు తాడికొండ వెంకటేశ్వర రావు (చిన్నా), అచంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకష్ణ, టిడిపి నాయకులు కుంపటి చిట్టిబాబు, అత్తులూరి గోపీచంద్, కోడి శ్రీనివాసరావు, పామర్తి రాంబాబు, జీళ్ళ శ్రీనివాసరావు, కటారి తాతయ్యా, అప్పారావు, కొండవీటి శ్రీను పాల్గొన్నారు.

బీమా అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండ లం అరిసేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గంటలమ్మ పాలెం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గుండెపోటుతో తమ్మన త్రిమూర్తులు మృతిచెందారు. శాసనసభ్యులు పేర్ని వెంకటరామయ్య (నాని) ఆదేశాలనుసారం గురువారం త్రిమూర్తులు భార్య తమ్మన ముల్లమ్మ కి వైయస్సార్ భీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అరిసేపల్లి గ్రామ ఇంచార్జ్ చండిక అజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఉత్పత్తిపై సదస్సు

ప్రజాశక్తి-గన్నవరం : విత్తన ఉత్పత్తిపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిడిఏ జ్యోతిరమణి పేర్కొన్నారు. ఉంగుటూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి రమణి మాట్లాడుతూ.. మేలు జాతి విత్తనాలను ఎంపిక చేసుకొని పంటల సాగుకు వినియోగించాలన్నారు. ప్రభుత్వం నుంచి 50 శాతం సబ్సిడీపై మేలు రకం విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా పండిన పంటలో మంచి విత్తనాలను దాచుకోవాలన్నారు. నాసిరకం విత్తనాలను సాగు చేస్తే పంట దిగుబడి తగ్గి ఇబ్బందులు పడతారని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్ ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్సి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి: టిడిపి

మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని శీరీదగ్గుమిల్లి గ్రామంలో తాడిచర్ల, కట్టవానిచెరువు, చింతల గుంట, దగ్గుమిల్లి గ్రామాలకు ఉపయోగపడే విధంగా కేటాయించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం మొదలుపెట్టి నాలుగు సంవత్సరాలు అయినా ఇంతవరకు పూర్తి చేయలేదని గుడివాడ టిడిపి పార్టీ ఇంచార్జ్ వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మాణాన్ని పూర్తి చేయకుండా నాలుగు గ్రామాల ప్రజల ఆరోగ్యం గాలికి వదిలేసిందన్నారు. ఈ నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి రామ్మోహన్రావు గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకష్ణ, భూతి ఇంచార్జి కొప్పుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆదిశేషు, బుర్ర ప్రసాదు మాజీ ఎంపీటీసీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో పవన్‌కళ్యాణ్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి-గన్నవరం : విశాఖ వారాహి విజయ యాత్ర-3లో పాల్గొనేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గన్నవరం విమానా శ్రయం నుంచి విశాఖకు గురువారం బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుండి రోడ్డుమార్గాన గన్నవరం విమాశ్రయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ ప్రత్యేక విమానంలో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ తో పాటు పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి జయసూర్య

నలుగురు దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలోని వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి జయ సూర్య తెలిపారు. గురువారం వీరవల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జయసూర్య మాట్లాడుతూ హనుమాన్‌జంక్షన్ సిఐ నరసింహమూర్తి పర్యవేక్షణలో వీరవల్లీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరంజీవికి రాబడిన సమాచారం మేరకు గురువారం మధ్యా హ్నం మూడు గంటల సమయంలో వీరవల్లి పాత చెక్ పోస్ట్ వద్ద హనుమాన్ జంక్షన్ నుండి గన్నవరం వెళ్ళు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన గండికోట శంకర్, గూడవల్లి వెంకట నరేంద్ర రాజు, మెండాల నరసింహారావులను పట్టుకున్నట్లు చెప్పారు. వీరిపై దొంగతనం కేసులు, అలాగే పలుచోట్ల ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందులో రాగి వైరు దొంగలించినట్లుగా కేసులు ఉన్నాయన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-చల్లపల్లి : గుండెపోటుతో హెూంగార్డు మృతిచెందిన సంఘటన చల్లపల్లి మండలం మంగళాపురంలో గురువారం జరిగింది. అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న గొరిపర్తి శ్రీనివాస్ ఇంటివద్దే గుండెపోటుకు గురై కన్నుమూశారు. ప్రస్తుతం అవనిగడ్డలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ గతంలో చల్లపల్లి పీఎస్ లో కొంతకాలం పనిచేశారు. మతునికి భార, పిల్లలు ఉన్నారు. నాలుగు పదులు నిండని వయసులో గుండెపోటుతో మృతిచెందటంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

శంకుస్థాపనలు ఫుల్...పనులు నిల్ : టిడిపి

మాట్లాడుతున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం కార్పొరేషన్ లో శంకుస్థాపనలు ఫుల్లు పనులు మాత్రం నిల్లు అని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు ఎద్దేవా చేసారు. స్థానిక నియోజక వర్గ పార్టీ కార్యాలయం లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతిపక్ష నాయకురాలు సమతా కీర్తి మాట్లాడుతూ గడప గడపకు వైసిపి అని హడావుడిగా 10 కోట్ల రూపాయల శంకుస్థాపనలు చేసి హడావుడి చేశారన్నారు. మరి ఆ పనులు ఎందుకు జరగడం లేదని, ఈ 10 కోట్ల నిధులు ఎం చేశారని ప్రశ్నించారు.17వ డివిజన్ లో పనులు కేటాయించి ఇప్పటివరకు వాటిని ఎందుకు ప్రారంభించ లేదో చెప్పాలన్నారు. ఉప ప్రతిపక్ష నేత అన్నం ఆనంద్ మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయం అధికార పార్టీ కార్యాలయంలా పనిచేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాళ్ల కొట్టు రాము, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, కార్పొరేటర్ దిద్ధకుంట సుధాకర్ తదితరులు మాట్లాడారు.

రెండు వార్డులకు ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ల స్థానాలకు గురువారం నామినేషన్ సేకరణ కార్యక్రమం జరిగింది. ముస్తాబాద్ పంచాయితీలో 1 వ వార్డు కు ధనకొండ అంజలి, కొండపావులూరు 6 వార్డు కూచిపూడి జ్ఞాన సుందరం నామినేషన్లు వేశారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఇరువురిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. చిన్న అవుట పల్లి 6 వార్డు కు ముగ్గురు నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులు పరిశీలన చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో సుందరయ్య భవనంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ మండల ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా ఐద్వా ఉపాధ్యక్షురాలు ఎస్ నాగమణి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జగ్గయ్యపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎం.అజయ్, కార్యదర్శిగా భరత్‌తో పాటు మరో ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎస్‌జిఎస్ కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడుగా పవన్, కార్యదర్శిగా నాగకృష్ణ, గర్ల్స్ కన్వీనర్‌గా ప్రత్యూషాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు ఎం రాజు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి జగనన్న అమ్మఒడి, వసతిదీవెన, విద్యదీవెన ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాడు- నేడు పనులను పూర్తి చేయాలని, నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

60వ డివిజన్లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-సింగ్‌నగర్: వాంబే కాలనీ 60వ డివిజన్లో బ్యాంకు రుణాలు రద్దు చేసి ప్రస్తుతం ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతూ గురువారం వాంబే కాలనీ జి బ్లాక్ వద్ద ఇళ్ల రిజిస్ట్రేషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనా ఇళ్ల రిజిస్ట్రేషన్ల గురించి పట్టించుకోలేదన్నారు. మరలా ఎన్నికలకు ముందు రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పటం నమ్మశక్యంగా లేదన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఇదే రీతిలో ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేస్తామని ఇంటి డాక్యుమెంట్స్ తీసుకుని 500 రూపాయలు వసూలు చేశారని తెలిపారు. నెలాఖరులోపు ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.కె.పీరుసాహెబ్, నాయకులు కె.ఓంకార్, ఎ.రత్నకుమారి, ఎస్.అప్పన్న, కె.రంగస్వామి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరాచారికి నివాళి

ప్రజాశక్తి-తిరువూరు: మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని తిరువూరు బిసి

బాలుర వసతి గృహంలో తెలుగు భాషా వికాస సమితి అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సుందరాచారి చిత్రపటానికి సమితి అధ్యక్షుడు తోట ఉమా మహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్, సంక్షేమ అధికారి ఎస్.హనుమా నాయక్ పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టభంలోని జే అర్ సి కాలేజీ దగ్గరలో గల మురుగు కాలువ సమస్య పై మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం స్పందించారు. పత్రికలలో, సోషల్ మీడియాల ద్వారా స్థానిక జే అర్ సి కాలేజీ వద్ద మురుగు కాలువ సమస్య పై మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర స్పందించారు. 20 రోజులలో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బంది అయిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి. శివ కోటేశ్వర రావు, అసిస్టెంట్ ఇంజినీర్ డి. హనుమంతరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కె. దుర్గాప్రసాద్‌లను మందలించారు.

పోలంపల్లి మునేరు చెక్‌డ్యామ్ గండ్లు పూడ్చాలి

ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య


మునేరు చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఏపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని పోలంపల్లి గ్రామంలో గురువారం రాజీవ్ మునేర్ చెక్‌డ్యామ్‌ను ఏపి రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ పోలంపల్లి చెక్‌డ్యామ్‌కు 20 అడుగుల లోతులో మూడు గండ్లు పడ్డాయని వాటిని వెంటనే పూడ్చాలన్నారు. ప్రథమ దశలో బ్రిటిష్ వారు కట్టిన గోడ నాలుగు అడుగులు సుమారు 20 మీటర్ల పొడవున వరదలకు కొట్టుపోయిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు మిర్చి, పత్తి, వరి నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని, నాట్లు పడాలంటే నీటి నిలువ సామర్థ్యం పెంచాలని డిమాండ్ చేశారు. పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు వరకు కూడా నీరు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందిచకుంటే మునేరు ఆయకట్టు కింద ఉన్న మూడు మండలాల రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనమోలు సైదులు, సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు మండపూడి చంద్రశేఖర్, నాయకులు తమ్మినేని రాంబాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తమ్మినేని రమేష్, కంచర్ల కొండయ్య, బి.రాము కోటేశ్వరరావు, ఏసుపోగు వెంకటరత్నం, తులసి అప్పారావు, రాయల వెంకటేష్, మాడుగుల నాగేశ్వరరావు, కందుల జానకోటయ్య, ధారా నాగేశ్వరరావు, అంకుల్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలి

ఫిలిప్పీన్స్‌లోఎంబిబిఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కౌన్సిల్ (వైయస్సార్ యూనివర్శిటీ) ఎదుట ఫారన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ గురువారం ఉదయం రిజిస్ట్రార్ రమేష్‌ను కలసి విన్నవించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పలువురు విద్యార్థులు తరలివచ్చారు. రిజిస్ట్రార్‌ను కలసిన అనంతరం వైద్య విద్యార్థులు సీహెచ్ నితిన్, శ్రీకాంత్, జయకృష్ణ, శశికళ, తేజశ్వీ, నిషిత మీడియాతో మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లను వివిధ రూపాల్లో ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. తక్షణం తమకు ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్‌తోనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని, నేషనల్ మెడికల్ కమిషన్ గైడ్‌లైన్స్ నిబంధనల మేరకు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం తక్షణం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గతంలో కోవిడ్ కారణంగా ఫిలిప్పీన్స్‌లో ఇంటర్న్‌షిప్ కుదరని నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాది కాలంపాటు ఎటువంటి స్టైఫండ్ లేకుండా కేవలం ఉచితంగా సేవలందించామని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ లేని కారణంగా ఉద్యోగాలతో పాటు ఆర్థిక ఇబ్బందులు అనేకం చవిచూడాల్సి వస్తుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేసి మూడు నెలలు గడుస్తున్నా మెడికల్ కౌన్సిల్‌తో పాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనబడలేదన్నారు. తమ డిమాండ్లను విన్న అనంతరం రిజిస్ట్రార్ రమేష్ మాట్లాడుతూ సానుకూలంగా స్పందించారని తెలిపారు. తమకు రెండు రోజులు గడువు ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరిస్తామని తమకు హామీ ఇచ్చినట్లు విద్యార్థులు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని, అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఫారన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణ, రోహిత, ప్రితమ్, భరత్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

యర్రన్న సంస్మరణ సభ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

యాదవ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో చోడిమళ్ళ యర్రన్న యాదవ్‌కు నివాళులర్పించారు. గురువారం గాంధీ నగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన సంస్మరణ సభలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు మాట్లాడుతూ యాదవ కమ్యూనిటీ అభివృద్ధికి చాలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాకు మల్లికార్జున్‌యాదవ్, బత్తుల అప్పారావు, వేలూరి గణేష్ బాబు, గెజిటెడ్ ఆఫిసర్స్ ఛైర్మన్ కె.వి.కృష్ణయ్య, సత్యన్నారాయణ, తులసీరామ్ పాల్గొన్నారు.

ఇంటరాక్ట్ క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందించే లక్ష్యంతో నూతనంగా ఇంటరాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ బాయన బాబూజీ (బాబ్జి) చెప్పారు. గురువారం రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ బాయన బాబూజీ ఆధ్వర్యంలో విజయవాడలోని చిట్టూరి హైస్కూల్‌లో నూతన "ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ చిట్టూరి హైస్కూల్" ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎమ్.వి.ప్రసాద్, డిస్ట్రిక్ట్ ఇంటరాక్ట్ కో-ఛైర్ జి.సుబ్బారావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సెక్రటరీ గుండారపు శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ మాలపాక భాస్కర్, చిట్టూరి ఆనందరామ్, జె.కె.సుబ్బారావు, జి.సుబ్బరావు, వై.శ్రీనివాసరావు ,ఇంటరాక్ట్ క్లబ్ ఛైర్ కె.మురళీకష్ణ, టీచర్ ఇంఛార్జి తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం వితరణ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు తమ సేవా తత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలలో 1992-93 విద్యా సంవ త్సరంలో 10వ తరగతి అభ్యసించిన పల గాని విజయలక్ష్మి, సున్నం రజిని, పసుపు లేటి పద్మప్రియ, గోగినేని అలివేలు మంగ తదితరులు పాఠశాలకు వితరణగా సౌండ్ సిస్టం గురువారం ప్రధానోపాధ్యాయులకు తిరువూరు తోసా నాయకులు కలకండ రవికుమార్‌తో కలిసి అందజేశారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మైలవరం: యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గంగరాజు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో అమలాపురం కేంద్రంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి వి.వసంతరావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, బి హుస్సేన్, బి బాలాజీ, బి పవన్, ఏ విజయలక్ష్మి, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** యుటిఎఫ్ రెడ్డిగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు స్థానిక అమర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు పి.భవాని , బిసిహెచ్‌వి సూర్యనారాయణ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించిన నాటి నుండి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పి సుబ్రహ్మణ్యం, కట్టా రవిబాబు, కట్టా విజయ్‌కుమార్, ఎం.వి.సుబ్బారావు, ఎం.చంద్రు, కె.సంధ్య, ఎం.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామలో కంచర్ల సుబ్బారావు కార్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పిఎస్ హరినాథ్ రెడ్డి యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు, బొద్దుకోలు రమణయ్య, ఎన్.బెనర్జీ, జి.చార్లెస్, జె.గంగరాజు , చిన్న నరసరావు, గడ్డం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** మండల కేంద్రంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సుబ్రమణ్యస్వామి, ప్రధాన కార్యదర్శి జిలానీ, గౌరవ అధ్యక్షులు ప్రైమర్ సాహెబ్, సీనియర్ నాయకులు పాము నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కానరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో...

రెడ్డిగూడెంలో...

నూరుశాతం ఇకెవైసి పూర్తి చేయాలి

- బిసి సొసైటీ ఇడి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : కృష్ణా జిల్లాలో అర్హులైన లబిదారులుకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందాలంటే నూరు శాతం ఈకెవైసి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బిసి సొసైటీ ఈడి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాష్ట్ర బి.సి. కార్పొరేషన్, మేనజింగ్ డైరెక్టర్, డాక్టర్.జి.సి. కిశోర్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ కార్పొరేషన్ల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగముగా అమలుపరుస్తున్న వివిధ సంక్షేమ పథకాల కింద డిబిటి విధానములో లబ్దిదారుల ఖాతాలలో జమవుతున్న మొత్తం అర్హులు అయినప్పటికి కొంతమందికి వారి వారి బ్యాంకు ఖాతాలకు ఈ కె వై సి చేయించుకోకపోవడం, ఎన్పిసిఐ ఎక్టివేషన్ చేయించుకోకపోవడమే కారణం అన్నారు. కాబట్టి ఎస్సి, ఎస్.టి., బి.సి, మైనారిటీ కార్పొరేషన్ల కార్యనిర్వాహక సంచాలకులతో జిల్లా స్థాయిలో ఒక కార్యాచరణ రూపొందించుకొని వివిధ సంక్షేమ పథకాల క్రింద అర్హులైన లబ్దిదారుల బ్యాంకు ఖాతాలను వందశాతం ఈ కె వై సి చేయించుట, ఎన్పిసిఐ, ఎక్టివేషన్ చేయించుట ద్వారా డి బి టి ద్వారా చెల్లింపులలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి ప్రసాద్, బ్యాంకు కంట్రోలింగ్ అధికారులు మరియు ఎస్సి., ఎస్టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ల అధికారులు, వార్డ్ సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి సొసైటీ ఈడి శ్రీనివాసరావు

ఉనికి కోసం బుద్ధప్రసాద్ తాపత్రయం

- ఎంఎల్ఎ సింహాద్రి రమేష్ బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో రైతంగ సమస్యలు అంటూ హడావుడి చేస్తున్న బుద్ద ప్రసాద్ ఉనికి కోసం తాపత్రయపడుతున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుండి సాగు తాగునీటి సమస్య లేకుండా రైతులు పంటలు పండించుకుంటున్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా తాగునీటి కోసం ధర్నాలు చేసిన పట్టించుకోలేదన్నారు. తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ముందే ఆక్విడేట్టుకు మరమ్మత్తులు నిర్వహించి సజావుగా సాగి నీరు అందేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కడ తాగునీటి కోసం ఇబ్బందులు ఇబ్బందులు పడటం లేదని, గతంలో టిడిపి అధికారంలో ఉండగా పులిగడ్డ ఆర్కిటెక్టివ్ చేసిన మరమ్మత్తుల బిల్లులు నేటికీ చెల్లించలేదని ఎద్దేవా చేశారు. గత ఏడాది జరిగిన పనులకు బిల్లులు పెట్టకపోయినా కాంట్రాక్టర్లతో కొమ్మక్కై స్వాహ చేశారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కృష్ణా డెల్టా ఆధునీకరణ పనుల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారి ప్రయోజనాల కోసం పనులు చేయించి కాంట్రాక్టర్లతో ఇల్లు కట్టించుకున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసు అన్నారు. గతంలో పులిగడ్డ పెనుమూడి వారధి కోసం ఆందోళన చేస్తే చివరిలో రాజీనామా చేసి నట్లు నాటకమాడి ఉద్యమాన్ని హైజాక్ చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలకుర్తి పథ్వీరాజ్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

మణిపూర్ సంఘటన అత్యంత దారుణం

- మహోత్సవాలు కాదు... ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి
- సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వర రావు

ప్రజాశక్తి ఘంటసాల : భారతదేశంలో తలదించు కునేలా మణిపూర్ సంఘటనలు కళ్ళ ముందు కనిపిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆజాదికా అమత మహొాత్సవాలను నిర్వహించడం సిగ్గుచేటని మల్లంపల్లి గ్రామ సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు పేర్కొన్నారు. భారతావని తలదించుకునేలా మణిపూర్లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించినా మోడీ ప్రభుత్వం పట్టించుకోకుండా గొప్పల కోసం నా భూమి – నా దేశం అంటే కార్యక్రమాలు నిర్వహించడం సబబు కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలసిన కేంద్ర ప్రభుత్వం మణిపూర్ లో జరిగిన సంఘటన పట్ల స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లంపల్లి గ్రామంలో గురువారం నా భూమి – నా దేశం కార్యక్రమం జరిగింది. మణిపూర్ లో జరిగిన సంఘటనపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కు ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేసి పూల మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శివరాం ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులు ఎత్తేయాలని నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు నాయుడు పర్యటన పురస్కరించుకొని జరిగిన అల్లర్లలో చంద్రబాబు నాయుడు పై కేసులు పెట్టటానికి నిరసిస్తూ గురువారం టిడిపి ఆధ్వర్యంలో అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలని, తమ నాయకుడు చంద్రబాబు నాయుడు రాష్ట్రమంతా తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తుంటే తమ నాయకుడికి నాయకుడికి ప్రజల నుండి వస్తున్న స్పందన చూడలేక ముఖ్యమంత్రి ఆదేశాలతో వైసిపి నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించేందుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు ను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. తక్షణమే చంద్రబాబు నాయుడు పై బనాయించిన అక్రమ కేసులను సంపాదించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఘంటసాల రాజమోహన్రావు, మాచవరపు ఆదినారాయణ, బచ్చు రఘునాథ్, దాసినేని శ్రీనివాన, షేక్ బాబావాలి, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాల్వలకు నీరు విడుదల చేయాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మెయిన్ కాలువకు, అనుబంధ కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేసి వరి పొలాలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బంటుమిల్లిలో గురువారం నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ బంటుమిల్లి మండలంలోని దాదాపు గత 15 రోజుల నుంచి బంటుమిల్లి ప్రధాన కాలువ కు సాగునీరు సరఫరా లేకపోవుట వలన రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ముంపుగురై దెబ్బతిన్న వరి పొలాల్లో మరల నాట్లు వేసుకుంటానికి ,వేద చల్లిన పొలాల్లో నాట్లు వేసుకోవడానికి నీరు లేకపోవడం, నారు కొనేందుకు సెంటు వెయ్యి నుండి 1500 రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోందన్నారు. కాబట్టి అధికారులు కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసు అజయ్ ఘోష్, సిఐటి యు నాయకులు మాజేటి శ్రీనివాసరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన రావు , సమ్మెట నాంచారయ్య గారు, కైలా లక్ష్మణ్ రావు గారు, గౌరిశెట్టి నారాయణరావు ,దూసనపూడి పరంధామయ్య ,బొడ్డు నాగరాజు ,నాగిశెట్టి వెంకన్న బాబు ,గౌరిశెట్టి వీరబాబు, గౌరిశెట్టి శ్రీనివాసరావు, పట్టపు శాంతారావు తదితర రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

2023 విద్యా సంవత్సరములో జరగనున్న నేషనల్ మీన్స్ –కం–మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కొరకు 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తాన తెలిపారు. 2023 డిసెంబర్ 3 న రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించ బడటం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మినిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు మరియు వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలలో ఈ సంవత్సరము 8 వ తరగతి చదువుతున్న కుటుంబ ఆదాయం రూ 3,50,000 లోపు ఉన్న విద్యార్థులు అర్హులు అన్నారు. పరీక్ష రుసుమ జనరల్, బి.సి విద్యార్థులకు రూ.100, యస్.సి, యస్.టి విద్యార్థులకు రూ.50. చెల్లించాల న్నారు. ఆగస్టు 10 తేది నుండి ఆన్ లైన్ దరఖాస్తులు దరఖాస్తులు అందుబాటులో ఉంటా యన్నారు. కాబట్టి కాబట్టి అర్హులైన ,ఆసక్తి కలిగిన విద్యార్థులు సెప్టెంబర్ 15 వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొలన్నారు. పూర్తి వివరముల కొరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్ సైట్ www.bse.ap.gov.in నందు లేదా జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయము, కృష్ణా జిల్లా, మచిలీపట్నం నందు సంప్రదించాలన్నారు.

సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో జూనియర్ విద్యార్థులచే సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సభ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కే సుందర కష్ణ ముఖ్య అతిథి గ పాల్గొనగా, వైస్ ప్రిన్సిపాల్ డా. పి .వీర బ్రహ్మాచారి, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ డా.ఆ.ర్. కిరణ్ కుమార్ మరియు రసాయన శాస్త్ర విభాగాధిపతి డా.డి. రామశేఖరరెడ్డిలతో పాటుగా విభాగ అధ్యాపకులు డా.కే. పుష్పలత, డా. ఎస్. రాంబాబు, జి. రవి, టి. అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కే సుందర కష్ణ మాట్లాడుతూ ఇటీవల విశ్వవిద్యాలయంలో జరిగిన క్యాంపస్ లో సగానికి పైగా సీనియర్ విద్యార్థులు హెటేరో డ్రగ్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీ మరియు ఎం. ఎస్ .ఎన్ కంపెనీ ఉద్యోగాలు సంపాందించడం విశ్వవిద్యాలయా నికి ఎంతో గర్వకారణం అనికొనియాడారు.

వీడియోగ్రఫీపై వర్క్ షాప్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమ సంఘం సౌజన్యంతో ప్రముఖ కెమెరా కంపెనీ నికాన్ నూతన టెక్నాలజీ కెమెరాలతో ఫోటో, వీడియోగ్రఫీపై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్ ప్రారంభించారు. నికాన్ కంపెనీ ప్రతినిధులు లేటెస్ట్ కెమెరాలు, సాఫ్ట్ వేర్, ఉపయోగించే విధానంపై స్థానిక ఫోటో వీడియో అవగాహన కల్పించారు. లేటెస్ట్ కెమెరాలు, సాఫ్ట్ వేర్ డెమోలు, విభిన్న కెమెరాలతో స్టాల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చిలంకుర్తి శేషు, కార్యదర్శి వంకా అనంత్ కుమార్, కోశాధికారి ఎం వి వి శ్రీరామ్, కార్యవర్గ కమిటీ సభ్యులు, మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ సభ్యులందరూ పాల్గొన్నారు.

దేవరకోటలో 'పొలంబడి '

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటశాల మండలం దేవరకోట రైతు భరోసా కేంద్రం పరిధిలో గల దాలిపర్రు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కె మురళీ కష్ణ ఆధ్వర్యంలో డా" వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో కలిసి పొలం పరిసరాలను పరిశీలించి నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతుల పాటించాలని రైతులకు తెలియజేశారు. నీటి యాజమాన్య పద్ధతిలో భాగంగా వరి మొక్క పిలక దశ నందు 5 సెంటిమీటర్ల నీటిని ఉంచడం ద్వారా మొక్క చక్కగా పిల్లకలు తొడగడానికి అవకాశం ఉందన్నారు. కలుపు యాజమాన్య పద్ధతిలో భాగంగా నాటు వేసి 3 నుంచి 5 రోజులు అయిన పొలంలో ఆక్సీడైఆర్జిల్ 40–50 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలుపుకుని ఎకరా పొలానికి పిచికారి చేసుకోవాలన్నారు. . నాటు వేసి 15 నుంచి 25 రోజుల అయిన పొలంలో బిస్పైరిబ్యాక్ సోడియం 100–120 ఎమ్మెల్ మందును ఒక ఎకరా పొలానికి పిచికారి చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వాలంటీర్లు, గ్రామ వ్యవసాయ అధికారి బి సత్య దేవ్ పాల్గొన్నారు.

గండిగుంటలో ఐదు నామినేషన్లు

ప్రజాశక్తి-ఉయ్యూరు : గండిగుంటలో 10వ వార్డు మెంబరు ఎన్నికకు సంబంధించి 5 నామినేషన్లు వచ్చినట్టు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రత్నకుమార్ తెలిపారు. నామినేషన్లు వేసేందుకు గురు వారం చివరి రోజుకాగా మంచిరోజు కావడంతో 5 మంది నామినేషన్లు వేశారు. కాగా నామినేషన్ వేసిన వారిలో కొందరు అదేరోజు వార్డులో ప్రచారం ప్రారంభించారు.

40 శాతానికిపైగా ఓటర్ల సర్వే పూర్తి : కలెక్టర్ ఢిల్లీ రావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 40 శాతానికిపైగా సర్వే పూర్తి చేశామని

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు తెలిపారు. ఈ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇఆర్‌వోలు, ఏఇఆర్‌వోలతో గురువారం సచివాలయ ప్రధాన కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనను బిఎల్‌వోలు విజయవంతంగా నిర్వహిస్తున్నరన్నారు. నిర్ధేశించిన గడువులోగా నూరు శాతం పూర్తికి

పురస్కారం కాదు ఆహ్వానం మాత్రమే

ప్రజాశక్తి- గంపలగూడెం : మండలంలోని 'అనుముల్లంక గ్రామానికి జాతీయ పురస్కారం' అన్న వార్త వాస్తవం కాదని స్థానిక ఎంపిడిఒ వై.పి.రెడ్డి తెలిపారు. ఈ విషయం అధికారులు పొరపాటుగా తెలిపారని, కేవలం స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానం మాత్రమే అందిందని తెలిపారు. పాఠకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

పంచాయతీ ఉప ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

పంచాయతీలోని 6, జమ్మవరం పంచాయతీలోని 8, తిరువూరు మండలం ఎర్రమాడు పంచాయతీ పరిధిలోని 7, వామకుంట్ల పంచాయతీలోని 8, కంచకచర్ల మండలం కొత్తపేట పంచాయతీలోని 7, పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామ పంచాయతీలోని 2, పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీలోని 6, వత్సవాయి మండలం సింగవరం గ్రామ పంచాయతీలోని 6, చందర్లపాడు మండలం పొక్కునూరు గ్రామ పంచాయతీలోని 5, జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 4, విజయవాడ రూరల్ మండలం నున్న పంచాయతీ పరిధిలోని 9వ వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

35 నామినేషన్లు దాఖలు

నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మూడు సర్పంచ్‌లు, 12 వార్డు మెంబర్లకు మొత్తం 35 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 10 మంది సర్పంచ్ పదవులకు, 25 మంది వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. జగ్గయ్యపేట మల్కాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి ఇద్దరు, వత్సవాయి మండలం పెదమోదుగపల్లి సర్పంచ్ పదవికి ముగ్గురు, వీరుల్లపాడు మండలం దాచవరం సర్పంచ్ పదవికి ఐదుగురు నామిషనేషన్లు దాఖలు చేశారు. ఇక చందర్లపాడు మండలం పొక్కునూరు ఐదో వార్డుకు ఒకరు, అనుమంచిపల్లి 4వ వార్డుకు ఒకరు, కంచికచర్ల మండలం కొత్తపేట 7వ వార్డుకు ఒకరు, నందిగామ మండలం తొర్రగుడిపాడు 8వ వార్డుకు 3, పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం రెండో వార్డుకు 2, పెనుగంచిప్రోలులోని 6వ వార్డుకు ఒకరు, తిరువూరు మండలం వామ్మకుంట్ల 8వ వార్డుకు ఒకరు, ఎర్రమాడు 7వ వార్డుకు ఇద్దరు, వత్సవాయి మండలం సింగవరం ఆరో వార్డుకు ఇద్దరు, వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు 8వ వార్డుకు ఒకరు, జామ్మవరం 8వ వార్డుకు ముగ్గురు, విజయవాడ రూరల్ మండలం నున్న 9వ వార్డుకు ఏడుగురు నామినేషన్లు వేశారు.

'అసైన్డ్' చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

చేసిన సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయడంలేదని, పేదల భూములను భూస్వాములు లాక్కుంటుంటే చోద్యం చూస్తున్నాయన్నారు. రాష్ట్రంలో భూ సమస్యల గురించి వామపక్ష పార్టీలకు తప్ప వైసిపి, టిడిపితోసహా ఏ పార్టీకీ పట్టడం లేదన్నారు. ఈ చట్టసవరణకు వ్యతిరేకంగా పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చీకటి రాజేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి సిహెచ్.జయరావు, ఇలపర్రు భూ పోరాట కమిటీ నాయకులు ఆర్.సి.పి రెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, ఐద్వా పట్టణ కార్యదర్శి కొడాలి సుజాత, ఎపి గ్రామ పంచాతయీ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.పోలినాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, మధు, ఆంజనేయులు, మోహనరావు, ప్రభుదాసు, ఆదిశేషు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాట్లోకి పుస్తక పంపిణీ కేంద్రాలు

చెప్పారు. ఠాగుర్ స్మారక గ్రంథాలయం అదనపు భవన నిర్మాణానికి కలెక్టర్ రూ.56 లక్షలు మంజూరు చేశారని, నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో గ్రాంథాలయలు లేనిచోట్ల స్థానికల కోరిక మేరకు పుస్తక నిక్షిత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 109 శాఖాగ్రంథాలయాలకు అదనంగా 161 పుస్తక పంపిణీ కేంద్రాలను ప్రారంభించేందుకు అనుమతించామన్నారు. పత్రికల కొనుగోలుకు రూ.1000, నిర్వాహకుల వేతనం కింద నెలకు రూ.3 వేలు చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు. శాఖా గ్రంథాలయలకు అవసరమైన కంప్యూటర్లు, స్టేషనరీ కొనుగోలుకు రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.90 లక్షలతో పుస్తకాలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గ్రంథాలయాల్లో టాయిలెట్లు, ప్రహరీ గోడలు, అదనపు గదుల నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేయడంతో పాటు దృశ్య శ్రవణ పరికరాల కొనుగోలుకు రూ.2 లక్షలు ఖర్చు చేసేందుకు తీర్మానించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని జమిగోల్వేపల్లి, గుడ్లవల్లేరు గ్రాంథాలయాలలో దాతల సహకారంతో 905 పుస్తకాల కొనుగోలు చేసినట్లు తెలిపారు. తిరువూరు, జమీగొల్వేపల్లి, మల్లవోలు గ్రాంథాలయాల్లో దాతల సహకారంతో సీలింగ్ ఫ్యాన్లు, ఐరన్ బీరువాలు, వాటర్ డిస్పెన్సర్, స్టీలు కుర్చీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సత్యనారాయణ పురం, చౌటపల్లి, మల్లవోలు, చిలకలపూడి, తిరువూరు, జి. కొండూరు, పెద ఓగిరాల, మానికొండ శాఖా గ్రంథాలయాలలో పనికి రాని పుస్తకాలను రద్దు చేసేందుకు తీర్మానించామన్నారు. కంచికచర్ల శాఖా గ్రంథాలయంలోని వాటర్ మెటర్ రిపేర్లకు, రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయానికి తాగునీటి సౌకర్యం కల్పనకు, బోరింగ్ పంపు ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వయోజన విద్యా ఉపసంచాలకులు యండి హాజీబేగ్, సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.మోహన్‌రావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు SC, ST కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 42/2021

Between:
Kala Ramesh ***...Petitioner***
AND
R-1: K.Mukteswara Rao, S/o. Brahmaiah, Driver of Lorry bearing No. AP 16 TD 2826, D.No. 59-5-1A, 4th Lane, ITI Bus Stop, Ashok Nagar, Vijayawada Urban, Krishna District.
R-2: Pappala Chandra Sekhar, S/o. Arjuna Rao, Owner of Lorry bearing No. AP 16 TD 2826, D.No. 74-14/1-2, Tresary EM Colony, Ayyappa Nagar, Vijayawada Urban, Krishna District.
...1 and 2 Respondents

పై నెంబరు పిటిషన్‌లో 1 మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 22-8-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 9-8-2023
ఎం.నాగేంద్రప్రసాద్ అడ్వకేట్, రాజమండ్రి

NAME CHANGE

I, Damerla Ramadevi D/o D. Ramatarakam R/o D.No. 8-643, Srinivasanagar, 2nd line, Tadigadapa,Krishna-521137, Andhra pradesh , india. have changed my name after mariage from DAMERLA RAMADEVI to BATTU SHYAMALA DEVI W/o B. Dhanumjayudu. as vide affidavit dated 10-08-2023 before Notary.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT GUDIWADA
E.P.No.40/2019 in O.S.No.361/2005

Between:- M/s Shriram Chits Pvt Ltd, Gudiwada Branch Rep by its Sr.Manager Cum GPA Holder. ...D.H.R
Vs
M.Venkaiah & Others ...J.D.R□s

Paper Publication Filed on Behalf of the D.H.R against the JDR No.11 (Satyavolu Ratna Rani)

11th JDR:-Satyavolu Ratna Rani, D/o (Late) Satyavolu VenkateswaraRao, 38Y, Occ:Employee(Govt), R/o D.No.17/588, Vani Sadan Apartment, GF-7, S.N.Puram, Gudiwada.

పై నెంబరు గల E.P లో 11th JDR కి Order 21 Rule 64 Notice నిమిత్తం ది.24-08-2023 తేదికి వాయిదా వేసియున్నారు. సదరు 11th JDR కి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా రోజు ఉదయం 10-30 గ॥లో పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

Pamarthi Srinivasa Rao, B.A., B.L.,
Advocate,
Gudiwada,
9848390457

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE AT MACHILIPATNAM
I.A.No.205/2023 in O.S.No.14/2023

Between:-
Nemani Veera Venkata Srinivasa Rao ...Petitioner/Plaintiff
And
Thigala Paidi Prakash ...Respondent/Defendant

Respondent/Defendant:-
Thigala Paidi Prakash son of late Madhusudana Rao, Hindu, age about 58 years, Business, Resident of D.No. 24/185, Ramanaidupet, Machilipatnam, Krishna Dist (Bandar PJCJ)

Whereas above I.A in above suit is posted to on 24-08-2023 for your appearance, so you shall appear on 24-08-2023 at about 10-30 am either by imperson or through your pleader or Advocate before the Hon□ble court, otherwise the court decided the matter in your absence, as if you fail to appear I.e ex-party Order may be order. It is for your notice.

By order of court

Machilipatnam,
09-08-2023.

K.Srimannarayana Murthy,
L.Krupamani,
Advocates,
16/448, Machavaram Mettu,

డాక్యుమెంట్లు పోయినవి

గుడివాడ పట్టణ డోరు నెం.13/147-303 పాటిమీద కాపురస్తులు మెట్టా లింగేశ్వరరావు, తండ్రి సుబ్రహ్మణ్యేశ్వరరావు వయసు 40 సం॥లు. నాకు నందివాడ మండలం, ఇలపర్రు గ్రామములో వ్యవసాయభూమి కలదు. దానిని చేపల చెరువుగా పండించుకుంటున్నాను. నా యొక్క ఆస్తి కాగితాలు తనఖా పెట్టుకుందామని వాటిని ఫోటోస్టాట్ తీయిద్దామని డాక్యుమెంట్సుని కవరులో వుంచి ఆ కవరు నా బండి హ్యాండిల్‌కు తగిలించి స్థానిక శ్రీలేఖ హోటలు వద్దకు ది.6-8-2023న ఉదయం 10 గంటలకు వచ్చి డాక్యుమెంటు కవరు చేతిలో పట్టుకుని టీ త్రాగి సదరు కవరు బండికి తగిలించుకుని తిరిగి స్టేడియం నందు గల నెట్‌సెంటరుకు వెళ్లి ఫోటోస్టాట్ తీయిద్దామని బండికి తగిలించిన డాక్యుమెంట్సు కవరు చూడగా సదరు కవరు లేదు. వచ్చిన దారి అంతా వెతికినాను. అయినా వాటి ఆచూకి దొరకలేదు. అప్పటినుండి యిప్పటివరకు అంతా వెతికి ఆరా తీసినాను. అయినా వాటి ఆచూకి దొరకలేదు.

డాక్యుమెంట్సు వివరములు:
1)డాక్యుమెంటు నెం.946/93 య.2.09ట్లు
2)డాక్యుమెంటు నెం.947/1993 య.1.37 ట్లు
3)డాక్యుమెంటు నెం.784/2023 య.4.55ట్లు
4)50/-లు స్టాంపుపేపర్లు ఖాళీవాటిమీద సంతకం పెట్టినవి-2 (నెంబర్లు.ఏఎక్స్ 885761, 885762)
5)యస్‌బిఐ చెక్కులు ఖాళీని సంతకములు చేసినవి నెంబర్లు (1)789561-789580 (2)328381-328405 (3)34676-34700 (4)26466-26490 (5)055246-055268
6)యాక్సిస్ బ్యాంకు చెక్కు ఖాళీవాటిపై సంతకాలు చేసినవి (1)073861-073870 (2)015761-015780 (3)003361-003370
7)ఐసిఐసిఐ బ్యాంకు చెక్కులు ఖాళీ వాటిపై సంతకాలు చేసినవి: 91)093811-093825.

ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల నా సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
మెట్టా లింగేశ్వరరావు,
పాటిమీద, గుడివాడ.
సెల్ :7997292348

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT :: HYDERABAD, TELANGANA

O.S.NO. **466** OF **2019**

Between :
M/s. Aurobindo Pharma Ltd. ... Plaintiff
AND
Abdul. Muzeeb & Others ... Defendants

To,
1. Abdul Muzeeb S/o. Abdul Mazeed R/o. H.No. 17-99, 404, Green Park Residency Kanuru, Vijayawada, A.P.-520 007.
2.Shaik Rafiq S/o SK. Yassuf Flat No. 201, Greenpark Residency Kanuru, Vijayawada, A.P. - 520 007.
3. Abdul Mazeed S/o. Md. Ismail R/o. H.No. 17-99, Greenpark Residency Kanuru, Vijayawada, A.P. - 520 007.
... Defendant No. 1to3

Whereas the plaintiff Company filed the above suit against you for recovery of damages / money. The above suit is posted to **08-09-2023** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at **10:30** a.m. on the above said date before the Hon'ble Court, failling which the suit will be heard and determined exparte.

(By Order of the Hon'ble Court)

K. Venugopal Reddy
K. Narasimha Reddy
Advocates
H.No.4-92/2/A, Ist Floor, Opp. Meeseva & GHMC, Chandanagar, Hyderabad - 500 050.

IN THE COURT OF THE HONOURABLE II ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.P.No. 4/2023

Between:
Domathoti Nagaveni ...Petitioner
And
1.Chembodi Bhavani,
2.Nagendla Ratna Kumari,
...Respondents No. 3 & 6

పై నెంబరు ఐ.పి పిటిషన్ కేసులో రెస్పాండెంట్ నెం. 3 & 6 అయిన మీకు కోర్టు నుండి అనేక సార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుట వలన శ్రీ కోర్టువారు ఈ వార్తాపత్రిక ద్వారా తెలియజేయమని ది.29-08-2023వ తేదీనకు వాయిదా వేసినారు. ఆ రోజు ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. అట్లు కాని యెడల కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the Honourable Court)

GOPE SRIKANTH,
Advocate, Vijayawada.
Counsel for Petitioner.

నెల్లూరు మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P.No. 581 / 2021

1. **యన్.విజయసారథి** - క్లయిమెంట్
Vs
1. **ఎస్‌కె. నాగూర్ మీరా** తదితరులు - రెస్పాండెంట్స్

To,
R2. **ఎం.వెంకట రమణారెడ్డి,** తండ్రి **సుబ్బరాయుడు రెడ్డి,** ఫ్లాట్ నెం.179/178, జవహర్ ఆటో నగర్, 4వ రోడ్డు, 1వ క్రాస్, విజయవాడ-7.

నోటీసు

పై నంబరు కేసు నందు క్లయిమెంట్స్ 2వ ప్రతివాదిపై క్లయిమ్ అప్లికేషన్ వేసియున్నారు. సదరు కేసు నందు 2వ రెస్పాండెంటు నోటీసు నిమిత్తమై కోర్టువారు కేసును **తే04-09-2023దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆదినం **ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై 2వ ప్రతివాది తమ ఆక్షేపణలును తెలుపుకోవలసినది. అట్లు తప్పినయెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

ఇట్లు
ఎన్.రూపకుమార్
న్యాయవాది, నెల్లూరు. సెల్: **98851 61350**

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, మల్లవల్లి గ్రామం, డోరు నెం. 2-70 కాపురస్తులు వణుకూరి పరిశయ్య గారి కుమారుడు వణుకూరి జోజి, వయస్సు 53 సం॥లు, వృత్తి: వ్యవసాయం మరియు మల్లవల్లి పి.ఎ.సి.యస్. బ్యాంక్ సెక్రటరీ, నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటుకు మల్లవల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘమునకు సెక్రటరీగా 2012వ సం॥రం నుండి పనిచేయుచున్నాడు. నా క్లయింటు పనిచేయుచున్న పి.ఎ.సి.యస్.బ్యాంకు నందు బొర్రా వెంకట సుబ్బారావు గారి కుమారుడు బొర్రా శ్రీనివాసరావు గారు ది. 15-11-1993వ తేదీన చిన్నాల పుష్పావతి వగైరాల వద్ద నుండి కొనుగోలు చేసి, నూజివీడు సబు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం. 3347/1993రుగా విక్రయ దస్తావేజును, నా క్లయింటుకు చెందిన బ్యాంకులో తనఖా పెట్టి, సదరు బొర్రా శ్రీనివాసరావు గారు పంట ఋణమును పొందియున్నాడు. అట్టి పరిస్థితులలో నా క్లయింటు సదరు పై తెలిపిన 3347/1993 రు గల దస్తావేజును మరియు యితర పత్రములను ఫొటోస్టాట్ తీయుటకు గాను ది. 05-07-2023వ తేదీన బ్యాంకు నుండి వీరవల్లిలోని జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, దారి మధ్యలో సదరు ఒరిజినల్ దస్తావేజుల కవరు ఎక్కడో జారి క్రింద పడిపోయినది. దానిపై నా క్లయింటు వచ్చిన దారిలో మరియు ఆ చట్టుప్రక్కల వెతికి చూసినప్పటికి సదరు దస్తావేజు కనపడియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు.

చీపు అర్జునరావు, న్యాయవాది
నూజివీడు 11-8-23
డో.నెం. 12-691/1, స్టేషన్ తోట నూజివీడు, సెల్: 9394870699

In the Court of the Special Sessions Judge for fast tracking the cases relating to atrocities against Women cum V Additional District and Sessions Judge, Khammam
MVOP No.212 of 2022

Between:-
సోమ మరియమ్మ మరియు ఇద్దరు ...వాదులు
అండ్
పి.జమలయ్య మరియు ముగ్గురు ...ప్రతివాదులు

నోటీసు

R1: పీరతి జమలయ్య, S/o. కోటయ్య, వయస్సు: 61 సం॥, వృత్తి:డ్రైవర్, నివాసం:రామవరప్పాడు రింగ్, కరెన్సీ నగర్, విజయవాడ, N.T.R జిల్లా.
R2: లోగనాయకి బాలచందర్ S/o. బాలచందర్, వృత్తి:లారీ ఓనర్, నివాసం:ఇంటి నెంబర్:24-24-7, నల్లచెరువు, 16 వ లైను, ఇంద్రగంటి నగర్, గుంటూరు

పైన తెలిపిన వాదులు, ప్రతివాదులు 1 మరియు 2 అయిన మీ పైన, పైన తెలిపిన కోర్టులో ఇన్సూరెన్స్ కోసం కేసు వేసి యున్నారు. అట్టి కేసు ది. 24-08-2023న వాయిదా కలదు. కావున ఆ రోజున మీరు స్వయంగా కానీ లేదా మీ తరుపు న్యాయవాది ద్వారా గానీ జవాబు చెప్పుకొనుటకు పైన తెలిపిన కోర్టునందు ఉదయం గం॥ 10-30 ని॥లకు హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్పు వెలువరించెదరని తెలియజేయడమైనది.

//కోర్టు వారి అనుమతితో//

యం.విజయ్ భాస్కర్,
అడ్వకేట్, ఖమ్మం,
సెల్ నెం.**9440728309**

చేపల చెరువు తవ్వకం నిలిపేయాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న అంకన్నగూడెం గ్రామస్తులు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలోని తమిరిశ గ్రామ శివారు అంకన్న గూడెంలో ఇళ్లకు ఆనుకుని చెరువు తవ్వకాన్ని వెంటనే నిలిపి వేయాలని గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. చేపల చెరువు తవ్వకం పనులు నిలిపివేయాలని ప్రోక్లైన్ వద్దకు గ్రామ ప్రజలు చేరుకొని తవ్వకం పనులు నిలిపివేయాలని ఆందోళన చేశారు. ఈ క్రమంలో నందివాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తవ్వకందారులకు కోర్టు ద్వారా ఆర్డర్ వచ్చిందని గ్రామస్తులు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ నివాసానికి సమీపంలో చేపల చెరువు తవ్వడం వలన ప్రమాదవశాత్తు పిల్లలు చెరువులో పడి మృతి చెందే అవకాశాలు ఉన్నాయని తక్షణమే చేపల చెరువు తవ్వకాలు నిలిపివేయాలన్నారు. అంతేకాకుండా ప్రజలు అనారోగ్యాల పాలవుతారని త్రాగునీరు కలుషితమై ఇబ్బందులకు గురవుతామన్నారు. గతంలో ఇళ్ల మధ్యలో చేపల చెరువులు తవ్వడం వల్ల అనారోగ్యాల పాలై గ్రామ శివారులకు వచ్చామని ఇక్కడ కూడా చెరువులు తవ్వడం వల్ల ఇళ్ళు లేక ఉనికిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువుల తవ్వకం ద్వారా త్రాగడానికి నీరు కరువై నివసించడానికి వీలు లేని పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. చేపల చెరువులు ఉండటం వల్ల ఎక్కువగా ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. తక్షణమే చేపల చెరువుల తవ్వకాన్ని నిలుపుదల చేయాలని దళిత ప్రజలు డిమాండ్ చేశారు. చేపల చెరువుల తవ్వకం పనులు నిలుపుదల చేయకపోతే ఇక్కడ కూడా ఈ ప్రాంతం నుండి కూడా ప్రాంతానికి వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని చెరువు తవ్వకాలని నిలుపుదల చేయాలని అంకన్న గూడెం దళిత ప్రజలు కోరుతున్నారు.

విఆర్ఎల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పుసునూరి చుక్కమ్మ

ప్రజాశక్తి-పెదపారుపూడి : పెదపారుపూడి వీఆర్ఏ పుసునూరి చుక్కమ్మను వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షురాలుగా, ప్రధాన కార్యదర్శిగా సోమవార్పాడు వీఆర్ఏ ఎడవల్లి కరిముల్లాను, కోశాధికారిగావెంట్రప్రగడ వీఆర్ఏ ఎడవల్లి నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జువ్వనపూడి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చుక్కమ్మ మాట్లాడుతూ వీఆర్ఏలు సమస్య పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను కాపాడాలి

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : మొక్కలను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొక్కలను ప్రతి ఒక్కరూ నాటి పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అవి దోహదపడతాయని చెప్పారు. వర్షాలు సక్రమంగా పడాలంటే మొక్కలు చెట్లుగా పెరకాలన్నారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందువల్ల ప్రతి ఒక్కరూ మీ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

వేగంగా భూముల రీ సర్వే రెండో దశ పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో భూముల రీ సర్వే రెండో దశ పనులు వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు.గురువారం మధ్యాహ్నం మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం నుండి సర్వే సెటిల్మెంట్ భూ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్, అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్ అహ్మద్ జిల్లా కలెక్టర్లతో భూముల రీ సర్వే, అసైన్మెంట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో దశలో చేపట్టిన భూముల రిసర్వే కార్యక్రమంలో 62 గ్రామాలకు గాను ఇప్పటివరకు 38 గ్రామాల్లో పూర్తయిందని మిగిలిన 24 గ్రామాల్లో ఈ నెలలోగా రీ సర్వే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీ సర్వే 24 గ్రామాలకు సంబంధించి సెక్షన్ 13 నోటిఫికేషన్లు కూడా ఈ నెలాఖరులోగా జారీ చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 20 గ్రామాల్లో సరిహద్దు రాళ్లు నాటారని, మిగిలిన 42 గ్రామాల్లో వచ్చే సెప్టెంబర్ మాసం లోగా పూర్తి చేస్తామన్నారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులతో చర్చిస్తామని, రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే లంక భూములకు సంబంధించి కూడా వెంటనే తగిన చర్యలు తీసుకొని అసైన్మెంట్ పూర్తి చేస్తామన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుంచి డిఆర్ఓ. ఎం. వెంకటేశ్వర్లు సర్వే భూ రికార్డుల ఏడి గండికోట రంగారావు పాల్గొన్నారు.

ప్రతిఇంటిపై జెండా ఎగురవేయాలి : ఎంఎల్ఏ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అజాదిక అమృత మహోత్సవంలో భాగంగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ గర్ కార్యక్రమాన్ని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు గురువారం పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపర్డెంట్ ఎం నాగమల్లేశ్వరరావు వద్దనుండి రూ 25 రూపాయలకు ఎమ్మెల్యే జాతీయ జెండాను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ ని పురస్కరించుకొని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో విక్రయిస్తున్న జాతీయ జెండాలను కొనుగోలు చేసి ప్రతి ఇంటిపై ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం ఛానల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, జిల్లా రైతు కమిషన్ సభ్యులు సామర్ల రామచంద్రరావు ,ఏపీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ సైకం బాబురావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి : కైలే

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పమిడిముక్కల: వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండల అభివద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పమిడిముక్కల మండల అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పమిడిముక్కల మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి, మండల అభివద్ధి అధికారి సిహెచ్ విటల్‌పాల్, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ,ఐనంపూడి సర్పంచ్ ఏనుగు బేబీ, మంటాడ ఎంపీటీసీ మేరుగా లక్ష్మి, సహకార బ్యాంకు అధ్యక్షులు మైనేని కోటేశ్వరావు, హౌసింగ్ ఏఈ ప్రసాద్,కరెంట్ ఎఇ శ్రీనివాస్, ఈవోపిఆర్‌డి వెంకటేశ్వరరావు, అయినపూర్ గ్రామ కార్యదర్శి స్వామి, పమిడిముక్కల ఎంపీటీసీ గురువిందపల్లి వంశీ, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, శ్రీరంగాపురం గ్రామ సర్పంచ్ దిమ్మెట పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను పారదర్శకంగా రూపొందించాలి

ప్రజాశక్తి - గుడివాడ : అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఓటర్ల లిస్టులు రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే,టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక 125వ బూత్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను టిడిపి నేతలతో కలిసి రావి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారంగానే సర్వే నిర్వహించాలని సూచించారు. ఓటర్ల సర్వేను నిర్వహించాలంటూ అనేక ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా ఎన్నికల సంఘం ప్రక్రియ చేపట్టడం హర్షనీయమన్నారు. ప్రధానంగా ఓటర్ల సర్వేలో వాలంటీర్లు భాగస్వామ్యం కాకుండా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడాన్ని తాము పూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు ముళ్ళపూడి రమేష్, పోలాసి ఉమా, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ సర్కార్

గుడివాడ నియోజకవర్గ టిడిపి మైనారిటీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు షేక్ సర్కార్, పట్టణ మైనార్టీ విభాగపు అధ్యక్షుడిగా షేక్ జానీషరీఫ్‌లు ఎంపికైనట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్ధరాత్రి కరెంటు కోతలు సరికాదు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఈఎల్ఆర్ పేరుతో అర్ధరాత్రి కరెంట్ కోతల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. గత రెండు, మూడు రోజులుగా ఈ ఎల్ ఆర్(ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్) పేరుతో అర్ధరాత్రి కరెంటు కోతలు గురించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సురేష్ బాబు మాట్లాడారు. పవన విద్యుత్ తయారీలో నెలకొన్న అంతరాయం వల్ల ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ ఇవ్వాల్సి వచ్చిందని పవర్ గ్రిడ్లు సాధారణ స్థితికి వస్తున్నాయని రానున్న రోజుల్లో ఈ ఎల్ ఆర్ సమస్య లేకుండా చూస్తామని అధికారులు తెలిపినట్లు సురేష్ బాబు పేర్కొన్నారు. కరెంటు కోతలతో వద్ధులు, పిల్లలు దోమలకాటుకు గురవుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు పగలు అంతా పని చేసి, రాత్రి సమయాలలో నిద్రపోయే సమయంలో విద్యుత్ కోతతో నిద్రలేమితో బాధపడుతున్నారని చాలా వ్యక్తం చేశారు. కావున రాత్రివేళ విద్యుత్ కోతలు నిలిపివేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

ప్రజాశక్తి... గన్నవరం (హనుమాన్‌జంక్షన్) : బొమ్ములూరు గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తల పెట్టిన మన భూమి మన దేశం కార్యక్రమంలో ప్రత్యేక అధికారిగా వచ్చిన పంచాయతీరాజ్ ఏఈ జయరాజు అధ్యక్షతన గ్రామ సర్పంచ్ విజయ్ భాస్కర్ కాటూరు ఆహ్వానితులు గా దేశం కోసం అమరులకు సంతాపం తెలిపారు. వారికి ఘననివాళి అర్పిస్తూ గ్రామ మట్టిని ఢిల్లీ వరకు పంపిస్తూ చేసిన కార్ర్యమంలో అధికారులు, డ్వాక్రా విఒఎలు గుల్లపలి అనంత లక్ష్మి, పచిగల్ల జ్యోతి సీసీ విమల పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్** : మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామ పంచాయతీలో గురువారం 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు 9వ తేదీ నుండి 15వ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తరుల మేరకు నా భూమి నా దేశం నేల తల్లికి నమస్కారం అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గడిదేసి అనూష అధ్యక్షతన గ్రామంలో మొక్కలు నాటారు. అమరవీరులకు స్థూపం వద్ద పేర్లు చెక్కించటం మట్టికి నమస్కారం చేయడం అమరవీరుల స్థూపం వద్ద జాతీయ జెండా ఎగరేసి నివాళులర్పించడంతో పాటు పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. వెలుగు ప్రాజెక్ట్ ఏపీ డి నత్త సుధాకర్ రావు, వెలుగు సిసి పాండురంగారావు, గ్రామ కార్యనిర్వహధికారి జానకి, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : ప్రభుత్వం స్వాతంత్ర్య అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ చేపట్టిన "నా భూమి నా దేశంనేల తల్లికి" వందనం కార్యక్రమమును మండలం లోని అంగలూరు , విన్నకోట, కూరాడ, చంద్రాల, కట్టవాని చెరువు, శరీ కల్వపూడి గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్ధ పధక సంచాలకులు జి.వి. సూర్యనారాయణ ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్ మండల తాసిల్దార్ మహమ్మద్ రహమాన్ మస్తానా, ఈవోపీఆర్డి సిహెచ్ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ 1 జి జగన్ మోహన్ రావు మండల వ్యవసాయ అధికారి సునీల్, అంగలూరు సర్పంచ్ మేడేపల్లి రవికుమార్ విన్నకోట గ్రామ పంచాయతీ కి గ్రామ సర్పంచ్ ముత్యాల సాంబయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు** : గూడూరు మండలం గురిజేపల్లి గ్రామంలో ఆజాదీ కా అమత్ మహోత్సవ్ నా భూమి నా దేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి నేతలు కుటుంబ రావు, తహసిల్దార్ విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో శిలా ఫలక ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, ప్రతిజ్ఞ, జెండా వందనం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. **ప్రజాశక్తి-కోడూరు** : మండలం పరిధిలోని పోటుమీద, పిట్టలంక, విశ్వనాథపల్లి గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనకదుర్గ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో పాండురంగారావు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పెదపారుపూడి : మెనూ ప్రకారం విద్యార్థు లకు భోజనం అందించకపోతే కఠిన చర్య తీసుకుంటా మని మండల ప్రత్యేక అధికారి జిల్లా పశువర్ధక శాఖ అధికారి ఎం ఎస్ ఏ దివాకర్ అన్నారు. గురువారం వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా వారిలో నైపుణ్యత పేరెంట్స్ మీటింగ్లో తల్లిదండ్రులకు తమ బిడ్డల విషయంలో ఆరోగ్యము విద్య పరిశుభ్రత విషయాల్లో తీసుకోవలసిన అంశాలపై సలహాలు ఇచ్చారు. అదేవిధంగా హైస్కూల్లో విషయంలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలించిన భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కే కిషోర్ శ్యామల, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కూలి రేట్లు పెంచండి

ముఠా కార్మికుల నిరవధిక సమ్మె, ప్రదర్శన

వన్‌టౌన్‌లో పలు వీధుల్లో కార్మిక నాయకుల ప్రదర్శన

ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్, కొత్తపేటలోని వివిధ వ్యాపారాల వద్ద ఎగుమతి, దిగుమతులు చేస్తున్న ముఠా కార్మికులు కులి రేట్లు పెంపుదల చేయాలని కోరుతూ గురువారం నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మె ప్రారంభంగా ముఠా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక ప్రదర్శన వన్‌టౌన్ చిట్టూరి కాంప్లెక్స్ వద్ద నుంచి ప్రారంభమై పలు వీధుల గుండా సాగింది. ఈ ప్రదర్శనలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డి.వి. కష్ణ, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం సాంబశివరావు పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాలు ఇప్పటికే అనేకసార్లు కూలీ రేట్లు పెంచమని సంబంధిత వ్యాపార యజమానులను అడిగారని, అయినా యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న ధరల నేపథ్యంలో ముఠా కార్మికుల జీవనం కష్టంతరంగా మారిందన్నారు. ఆదాయం తగ్గి ఖర్చులు పెరుగుతున్న సందర్భంలో కూలి రేట్లు పెంచటం న్యాయమన్నారు. రెండేళ్లకోసారి కూలి రేట్లు పెంపు ఒప్పందం మేరకు, గత కూలి రేట్లు ఒప్పంద కాలం గడిచి మూడు నెలలు అయిందన్నారు. ఇప్పటికైనా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని యజమానులను కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక నాయకులు ఎం.సీతారాములు, వి.నాగేశ్వరరావు, బ్రహ్మయ్య, ఇ.వి. నారాయణ, శ్రీరామమూర్తి, చౌదరి, దాసు, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రయంప్ స్పీడ్ 400 బైక్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రతిఒక్కరూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ట్రయంప్ స్పీడ్ 400 బైక్‌ను విజయవాడ అడిషనల్ డిసిపి లక్ష్మీపతి గురువారం సాయంత్రం ట్రయంప్ షోరూమ్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా నూతన ట్రయంప్ స్పీడ్ 400 బైక్‌లను నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. అనంతరం లక్ష్మీపతి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ట్రయంప్ మోటార్ బైక్‌ల పట్ల యువత ఆసక్తి చూపుతున్నారని, వారికి అనుగుణంగా చక్కటి సదుపాయాలతో బైక్‌ను రూపుదిద్దుకుందని, తాను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రొబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోడీ మాట్లాడుతూ భారతీయ మోటార్ సైకిల్ పరిశ్రమకు ఒక ప్రతిష్టాత్మకంగా ఈబైక్ ఉంటుందని తెలిపారు. స్పీడ్ 400 బైక్‌తో తాము డీలర్ భాగస్వామితో కలసి బ్రాండ్ ట్రయంప్ ఔత్సాహిక రైడర్‌లకు సరైన ఎంపికగా మార్చే ప్రయాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ట్రయంప్ సేల్స్ ప్లానింగ్ మేనేజర్ సాయి ప్రసన్న మాట్లాడుతూ ట్రయంప్ బైక్‌లను ఒరిజనల్ యాక్సెసరీస్‌తో తమకు కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చని తెలిపారు. డీలర్‌షిప్ వద్ద స్పీడ్ 400 కోసం 25 కంటే ఎక్కువ అసలైన ఉపకరణాలు ఉన్నాయని తెలిపారు. స్టైలింగ్, సౌకర్యం నుండి సామాను, భద్రత వరకు, బైక్‌ను విస్తృత శ్రేణి రైడర్‌ల అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చని తెలిపారు. కొత్త కస్టమర్లు 16వేల కిలోమీటర్లు సర్వీస్ విరామాలతో రెండేళ్ల అపరిమిత మైలేజ్ వారంటీతో పాటు మరో మూడేళ్ళ పొడిగించిన వారంటీని సైతం పొందుతారని అన్నారు. ట్రయంప్ స్పీడ్ 400 ఎక్స్‌షోరూమ్ ధర రు. 2.33 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి. సత్యనారాయణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్సు మహోత్సవం

ప్రజాశక్తి-భవానీపురం: నల్లకుంట,రాయనపాడు రోడ్డు గొల్లపూడి రూరల్‌లో గల 'హాజరత్ సయ్యదున మజిలీ బాబా' అవులియా వారి 29వ ఉర్సు గంధం మహోత్సవం, దర్గా ముతవల్లి షేక్ ఖాజ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఫకీర్ల మేళతాలతో, అంగరంగ వైభవంగా కన్నులపండుగా జరిగింది. బాబా వారికి "చాదర్" సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో షేక్ ఖాజ, సూఫీ మత గురువులు అల్తాఫ్ రజా, ఖాజి నవాజ్ మరియు స్థానిక మత పెద్దలు, బాబా వారి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. 11వ తేదీ శుక్రవారం "చిరాగా" అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఖాజా తెలిపారు.

టయోట రూమియన్ కారు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టయోట కిర్లోస్కర్ మోటార్ పూర్తి సరికొత్త రూమియాన్ కారును మార్కెట్లోకి ఆవిష్కరించినట్లు టయోటా షోరూమ్ ఇన్‌ఛార్జి కె.ఎస్.రావు తెలిపారు. ఈసందర్భంగా టయోటా షోరూమ్‌లో వివరాలను తెలియచేశారు. ఈనూతన కారు ఆకర్షణీయమైన, విధంగాఉంటుందన్నారు. ఇంధన సామర్థ్యం కూడా ఎక్కువగా వస్తుందని తెలిపారు. ఎంపివి విభాగంలో ముందంజలో ఉన్న ఈ సెవన్ సీటర్ కారు టయోటా మార్కెట్ ఉనికిని మరింత పెంచుతుందన్నారు. సరిక్తొత టయోట రూమియన్‌లో నియో డ్రైవ్ టెక్నాలజీ, ఈసీఎన్జీ టెక్నాలజీతో కూడిన శక్తివంతమైన కెసిరీస్ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్ ఉందని వివరాలను టయోటా షోరూమ్‌ల నందు సంప్రదించవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న రైల్వే కార్మికుల దీక్ష

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ రైల్వే స్టేషన్లో పనిలో నుండి తొలగింపబడిన కాంట్రాక్ట్ కార్మికులు గురువారం మూడవ రోజు నిరాహార దీక్షను కొనసాగించారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతును తెలియజేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగించాలని తెలియజేశారు. కార్మికులను పనిలో నుండి అక్రమంగా ఆపేసి వాళ్ళు పస్తులు ఉండే పరిస్థితి కాంట్రాక్టర్, రైల్వే అధికారులు కల్పించారన్నారు. కాంట్రాక్టర్ మొండి వైఖరి మానుకోకపోతే ఈ ఉద్యమాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. రైల్వే అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నెరవేర్చి కార్మికులను త్వరగా పనిలో పెట్టించాలని కోరారు. ఇప్పటికే కార్మికులను పని నుండి ఆపి నెల రోజులు దగ్గర పడుతుందని, అయినా అధికారులు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా ఎన్‌టిఆర్ జిల్లా కన్వీనర్ ఎ.కమల, సీఐటీయూ నాయకులు ఎస్.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మార్కెట్లో భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక గొల్లపూడి ఐరన్ మార్కెట్ యార్డులో సుమారు రూ.3 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన భోజనశాలను గురువారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. నూతన లారీ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ వ్యాపారస్తులకు అండగా ఉండేందుకే రోడ్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో అన్ని రోడ్లు సిమెంట్ రోడ్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, ఐరన్ యార్డ్ అసోసియేషన్ ప్రతినిధులు వక్కలగడ్డ శ్రీకాంత్, గుర్రం రమణయ్య, అప్పలస్వామి, ముఠా కార్మిక నాయకులు ఎం.సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: చేనేత హస్తకళా వైభవాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందని, దేశంలో వ్యవసాయం తరువాత అత్యధికంగా ఈ రంగంపైనే అధారపడి జీవిస్తున్నారని యువజనాభ్యుదయం, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి, పురావస్తు శాఖ కమిషనర్ డాక్టర్ జి.వాణీమోహన్ అన్నారు. ఇప్పటికే దేశంలో పురాతన కళలు కొన్ని అంతరించి పోయాయని, వారసత్వ సంపదగా చేనేత కళాకారుల కళా నైపుణ్యానికి అద్దం పడుతున్న చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. నగరంలోని పటమట ఎన్ టి ఆర్ సర్కిల్ సమీపంలోని మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని వాణీ మోహన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చేనేత జౌళి శాఖ, ఆప్కో సంయుక్తంగా ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించటం ముదావహమన్నారు. యువతను ఆకర్షించే విధంగా ప్రస్తుతం చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, వారంలో ఒక్క రోజైనా చేనేత ఉత్పత్తులు ధరించటం ద్వారా ఈ రంగాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆప్కో జిఎం తనూజా రాణి, మార్కెటింగ్ అధికారి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శన శనివారం వరకే ఉన్నందున కొనుగోలు దారులు త్వరపడాలని, ప్రత్యేక రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

'హెయిర్ కేర్' ఉత్పత్తుల పరిచయం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ డైసన్ హెయిర్ కేర్ సంస్థ నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంకిత్ జైన్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఉదయం ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డైసన్ సాంకేతికతంగా అధునాతన స్టైలింగ్ ఉత్పత్తులను తీసుకురావడంతో పాటు శిరోజాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా తమ సంస్థ జాతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా దీపికాను నియమించినట్లు తెలిపారు. అలాగే తమ సంస్థ ఆరోగ్యకరమైన హెయిర్ స్టైలింగ్ కోసం ఆధునిక సాంకేతికను ఉపయోదగించి ఏవిధంగా నూతన ఉత్పత్తులను తీసుకువస్తున్నామో తెలియచేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని నూతన ఉత్పత్తులతో ప్రజలకు విస్తృత స్థాయిలో సేవలను అందించనుననకట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-వన్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు చెప్పారు. నగర పాతబస్తీలోనే 53వ డివిజన్ పరిధి గణపతిరావు రోడ్డులో కొత్తపేట ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ ఎన్‌సిసి విభాగం విద్యార్థులు గురువారం మొక్కలు నాటి ట్రీ గార్డ్‌లను అమర్చారు. మేరీ మట్టి – మేరా దేశ్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరిపిళ్ళ రాజేష్, శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ధర్మకర్త గురుమహంతు మహేష్, నాయకులు పడాల రాజేష్ పాల్గొని సుమారు 50 మొక్కలు నాటారు. మహాదేవ్ అప్పాజీరావు జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో హిందూ హైస్కూల్ హెచ్‌ఎం కంచర్ల శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారి బి.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రాంతంలో పార్కు ఏర్పాటు తగదు : సిఐటియు

ప్రజాశక్తి-వన్‌టౌన్: గత 40 సంవత్సరాలకు పైగా శ్రీనివాసమహల్ పైన కొండ ప్రాంతంలో నివసించే రిక్షా, ఆటో కార్మికులు కెటి రోడ్డులోని చెరువు ఆసుపత్రి పక్క నుండి కేబిఎన్ కళాశాల బయట పక్కగా తమ వాహనాలను పార్కింగ్ చేసుకుని జీవసం సాగిస్తున్నారని, ఈ ప్రాంతంలో చిన్నపాటి పార్కు నిర్మించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ సిఐటియు పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో ఆటో, రిక్షా కార్మికులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె. సూరిబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి మాట్లాడుతూ కెబిఎన్ కాలేజీ పక్కన, రోడ్డుకు అడ్డం లేకుండా చాలాకాలంగా ఆటో, రిక్షా కార్మికులు, ఓనర్లు తమ వాహనాలను పార్కింగ్ చేసుకుంటారని తెలిపారు. వీరంతా కొండ ప్రాంతంలో నివసిస్తుంటారని, వారి వాహనాలు పెట్టుకునేందుకు వేరు మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నాయకులు గాదె సుబ్బారెడ్డి, గాదె బాలిరెడ్డి, కార్మికులు పోలవరపు నూకరాజు, కడవల కనకారావు, పి.రాము, శ్రీను, రె. లోవరాజు, తాతబ్బాయి షేక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.